ప్రభుత్వ ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంపు


బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు 2శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్రప్రభుత్వం ఉద్యోగులు, పెన్షన్‌దారులకు 3శాతం డీఏను ఇటీవల పెంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యోగులకు 2 శాతం డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీఎస్ షడాక్షరి బుధవారం తెలిపారు. జూలై 1 నుంచి అన్వయించనుందన్నారు. 3 నెలల డీఏ అరియర్స్ ఉద్యోగులకు దక్కనుందన్నారు. డీఏ పెంపుపై ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలు

ఎమ్మెల్యే గ్రాంట్లు...

- 11 నెలలు గడిచినా విడుదలకాని వైనం
- తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు ప్రకటన
- అందులో సగం బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలకు..

ఇంకెప్పుడు..?



బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అత్యవసర పనులు చేపట్టేందుకు ఏడాది కిందట ఓ ఎమ్మెల్యేకు రూ.10 కోట్ల చొప్పున గ్రాంటును ప్రకటించారు. అయితే నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఇటీవలే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు రూ.50కోట్లు, ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలకు 25-30 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏడాదిక్రితం ప్రకటించిన నిధుల ఊసే లేకుండా పోయింది. కొత్తగా 50 కోట్లు ఎప్పుడు వస్తాయోననే సంశయాన్ని అధికార కాంగ్రెస్ సభ్యులే వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాలతోపాటు అత్యవసరంగా రోడ్ల నిర్మాణం, కల్వర్టుల ఏర్పాటు, మురుగు కాల్వల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు 2024 నవంబరులో రూ.10 కోట్లు ఎమ్మెల్యే గ్రాంట్స్ విడుదల చేస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో 189 మంది ఎమ్మెల్యేలకు పార్టీలకు అతీతంగా రూ.10 కోట్ల చొప్పున ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రకటించి పది నెలలు దాటినా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖకు ఇప్పటివరకు గ్రాంట్లు విడుదల కాలేదని తెలుస్తోంది. ఆర్థికశాఖ నుంచి గ్రాంట్లు విడుదల కాలేదని, అయితే కారణాలు చెప్పలేమంటూ దాటవేస్తున్నారు.

సీఎం హామీ ఏమైంది?

గత ఏడాది భారీ వర్షాలు, వరదలతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, కల్వర్టులు శిథిలమయ్యాయి. ప్రకృతి వైపరీత్య పరిహార నిధిలో భాగంగా ప్రతి గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు గ్రాంట్లు అవసరమని డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడితో సీఎం సిద్దరామయ్య పార్టీలకు అతీతంగా 189 మంది రూరల్ ఎమ్మెల్యేలకు గ్రాంట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రోడ్లు, కల్వర్టులు ఇతర నిర్మాణాలకు ఆర్థికశాఖ రూ.1,890 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో చేపట్టనున్న పనులకు ఆర్థికశాఖ గడువును విధిస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. వీటి ప్రకారం గత ఏడాది నవంబరులో ఎమ్మెల్యేలు వర్క్ ఆర్డర్‌ను సమర్పించారు. అత్యవసర పరిస్థితులనుబట్టి వర్క్ ఆర్డర్‌లను సిద్ధం చేశారు. కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలికి ఒప్పించాలని ఎమ్మెల్యేలు సిఫారసు చేశారు. అయితే కేఆర్ఐడీఎల్ కాంట్రాక్టర్ల ద్వారా పనులను చేపడుతున్నారు. మొత్తం అంచనా వ్యయంలో 33శాతం ముందుగా చెల్లించవచ్చు. శాసనసభ నియోజకవర్గంలో 10 కోట్ల రూపాయల గ్రాంటు విడుదల కాలేదు. పైగా ముందస్తుగా 33శాతం విడుదల చేయాల్సిన నిధులు కూడా రాలేదు. వర్క్ ఆర్డర్‌లు ఎక్కడికక్కడే ఉన్నాయి. ఇలా నియోజకవర్గంలో సదరు పనులకు ఇతరత్రా నిధులతో చేపట్టే అవకాశం ఉండదు. పాత నిధులు రాకపోగా కొత్తగా ఇతరత్రా గ్రాంట్లతో కొనసాగించే పరిస్థితి లేకుండాపోయింది. ఇలా ఏడాది క్రితం వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు మరింత అధ్వానంగా మారాయి. గ్రామాల్లో మురుగు కాల్వల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వాస్తవానికి ఒకేసారి రూ.2వేల కోట్లు విడుదల చేసే పరిస్థితి లేదని ఆర్థికశాఖ సూత్రప్రాయంగా తెలుపుతోంది.

ఏడాదవుతున్నా విడుదలకాని వైనం

ఏడాదిక్రితం ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన రూ.10 కోట్ల గ్రాంట్లు విడుదల కాలేదు. పైగా రెండున్నరేళ్ల పాలన ముగుస్తున్న తరుణంలో రాజకీయాలలో వినూత్నమైన చర్చలు తెరపైకి వస్తున్నాయి. ఇటువంటి తరుణంలోనే అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఏకంగా రూ.50 కోట్లు చొప్పున విడుదల చేస్తానని మూడు నెలలక్రితం సీఎం ప్రకటించారు. జూలైలో చీఫ్ మినిస్టర్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రామ్ (సీఎంఐడీపీ) ద్వారా విడుదల చేస్తామని ప్రకటించారు. ఇందులో 37.50 కోట్లు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకోసం, మిగిలిన 12.50 కోట్లు ఎమ్మెల్యే సూచించిన పనులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రూ.37.50 కోట్లలో ప్రజాపనులు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ద్వారా అమలు చేయాలని సూచించారు. కర్ణాటక లోకల్ ఏరియా డెవలెప్‌మెంట్ స్కీమ్ ద్వారా గ్రాంట్లు విడుదల చేస్తామన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము కూడా శాసనసభ్యులేమని ముఖ్యమంత్రికి విన్నవించారు. దీంతో ప్రాంతాలవారీగా రూ. 25-30 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఎటువంటి వర్క్ ఆర్డర్‌లు ఇవ్వలేదు. కాగా బీజేపీ ఎమ్మెల్యేలు గ్రాంట్ల విడుదలకు సంబంధించి ముఖ్యమంత్రి ప్రకటనలపై మండిపడ్డారు. గత ఏడాది గ్రామీణ ప్రాంత ఎమ్మెల్యేలకు 10 కోట్ల గ్రాంటు హామీ నెరవేర్చలేదని తాజాగా అధికార పార్టీ సభ్యులకు రూ.50కోట్లు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు రూ.25-30 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించారని, అది ఎప్పటికి అమలు చేస్తారనేది స్పష్టత లేకుండా ఉందంటున్నారు.



హంపిలో విరూపాక్షేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మంత్రి నిర్మలా సీతారామన్



వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల తయారీని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- కొప్పళ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజనను సమర్థవంతంగా వినియోగించుకుని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ రైతులకు సూచించారు. కొప్పళ జిల్లా మెతగల్‌లో ఎంపీ లాడ్స్‌తో నబార్డ్ ద్వారా నిర్మించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ శిక్షణ విభాగం, సామాన్య సౌకర్యాల కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష అని అన్నారు. పండించిన పండ్లను ప్రాసెస్ చేసుకుని, ధరను పెంచుకునే నైపుణ్యాన్ని రైతులు పెంచుకోవాలని సూచించారు. చిన్నతరహా పరిశ్రమల ద్వారా ప్రగతి పథంలో నడుస్తున్న కొప్పళ జిల్లా, వచ్చే రోజుల్లో ఉత్తర కర్ణాటకకు అక్షయపాత్ర అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపు వ్యవసాయ రంగంలో ఉత్తేజాన్ని నింపుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల్లో వివిధ రాష్ట్రాల రైతుల కోసం రూ.3,700 కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, రూ.11వేల కోట్ల రుణ సౌకర్యం కల్పించిందని తెలిపారు. లక్ష మందికి పైగా రైతులు పరిశ్రమల వ్యవస్థాపకులుగా ఎదిగారని అన్నారు. ధనధాన్య కృషి యోజన కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.24 వేల కోట్లను కేటాయించామని, దేశంలో వంద జిల్లాలను ఈ పథకానికి ఎంపిక చేశామని తెలిపారు. ఇందులో కొప్పళ జిల్లా ఒకటి అని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి తిలకించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్సీ హేమలతా నాయక్, మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్ళి, నబార్డ్ అధికారులు, రైతు ఉత్పాదక కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల పాలన అద్భుతం..

విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయ పరిపాలన అత్యద్భుతమని మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. హంపి విరూపాక్షేశ్వరుడిని బుధవారం ఆమె దర్శించుకున్నారు. దేవదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం ఆమె లక్ష్మి (ఆలయ ఏనుగు) ఆశీర్వాదం పొందారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఇక్కడి విశేషాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. విజయనగర సామ్రాజ్య గత వైభవాన్ని ఇక్కడున్న ప్రతి రాయి గుర్తు చేస్తుందని అన్నారు. శ్రీకృష్ణదేవరాయల పాలన ఈనాటి పాలకులైన తమకు ఆదర్శమని అన్నారు. రాయల కాలం నాటి ఈ జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. పురావస్తు శాఖ హంపి స్మారకాలను పరిరక్షిస్తోందని అభినందించారు. కేంద్ర మంత్రి వెంట బళ్లారి ఎంపీ తుకారాం ఉన్నారు.



ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

ఐదు పదుల వయసులో ప్రేమ

- త్వరలోనే సంగీత దర్శకుడు రఘుదీక్షిత్ వివాహం





రఘుదీక్షిత్, వారిజశ్రీ వేణుగోపాల్

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు రఘుదీక్షిత్‌కు ఐదు పదులలో మరోసారి ప్రేమ చిగురించింది. ఈనెలాఖరున ప్రముఖ గాయని వారిజాశ్రీ వేణుగోపాల్‌తో వివాహం కానుంది. బహుభాషా జానపద సంగీత ప్రముఖుడిగా రఘుదీక్షిత్‌కు పేరుంది. గ్రామీ నామినేటెడ్ సంగీత కళాకారిణి, వేణువాదకురాలు వారిజశ్రీ వేణుగోపాల్‌తో ఇటీవల ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. ఇదే విషయమై రఘుదీక్షిత్ మీడియాతో మాట్లాడుతూ నా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. నేను అనుకోలేదని, ఇదంతా ఆకస్మికంగా జరిగిందన్నారు. కొత్త జీవితంలో కొత్త అధ్యాయంలో కలసి జీవించాలని అనుకుంటున్నామన్నారు. ప్రముఖ నృత్య కళాకారిణి మయూరి ఉపాధ్యాయను రఘుదీక్షిత్ వివాహం చేసుకున్న తర్వాత కొన్నేళ్లకు భిన్నాభిప్రాయాలు ఏర్పడంతో విడాకులు తీసుకున్నారు.

1 నుంచి 'ఏ' ఖాతా సౌలభ్యం

- ఆన్‌లైన్ సేవలకు డీసీఎం శ్రీకారం



ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దీపావళి సందర్భంగా బెంగళూరు నగర ప్రజలకు గుడ్‌న్యూస్ చెప్పింది. బీ ఖాతా నుంచి ఏ ఖాతాకు మార్పు చేసుకునే సదుపాయాన్ని, కొత్త ఇంటి స్థలాలకు ఏ ఖాతా మంజూరుకోసం ఆన్‌లైన్ సేవలను బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి, డీసీఎం డీకే శివకుమార్ ప్రారంభించారు. బుధవారం విధానసౌధలో ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టారు. అనంతరం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో బెంగళూరు ప్రజలకు వీలుగా రాష్ట్రప్రభుత్వం గొప్ప నిర్ణయాన్ని తీసుకుందన్నారు. నవంబరు 1 నుంచి బీ ఖాతాను ఏ ఖాతాకు మార్పు చేసుకునే అభియాన ఉంటుందన్నారు. ఇది బెంగళూరులోని 15 లక్షల ఆస్తుల యజమానులకు ఉపయోగం కానుందన్నారు. నవంబరు 1న ప్రారంభమయ్యే కార్యక్రమం వందరోజులపాటు కొనసాగుతుందని, అర్జీతోపాటు 500 రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే పాలికె అధికారులే ఇంటి వద్దకు వచ్చి సేవలందిస్తారన్నారు. ఆస్తి యజమానులు సదరు ఆస్తి గైడెన్స్ ధరలో 5శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాలికెలో రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తారన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న సీఎం సిద్దరామయ్య



హారతి తీసుకుంటున్న సీఎం

హాసనాంబ సేవలో సీఎం

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి మాత్రమే తెరుచుకునే హాసనాంబ ఆలయాన్ని సీఎం సిద్దరామయ్య దర్శించుకున్నారు. బుధవారం హాసన్ నగరంలో వెలసిన ఆలయానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. నేరుగా ఆలయంలోకి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంత జీవనం గడపాలని దేవిని ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిశాయని, మంచి పంటలు పండి రైతులు బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాసనాంబదేవి దర్శనం వేళ ఏటా వీఐపీ పాసులు సంస్కృతి గందరగోళంగా ఉండేదన్నారు. ప్రస్తుతం సాధారణ దర్శనానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ ప్రత్యేక విధానం తీసుకొచ్చారన్నారు. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకుంటున్నారన్నారు. మాది కువెంపు ఆశయమని, 'సర్వజనాంగద శాంతియతోట' నినాదమన్నారు. గత ఏడాది కూడా హాసనాంబ దేవిని దర్శించుకున్నా అన్నారు. హాసనాంబదేవి జాతరకు అవసరమైతే వచ్చే ఏడాది గ్రాంట్లు పెంచుతామన్నారు. దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యే శివలింగేగౌడ, ఎంపీ శ్రేయస్‌పటేల్ తదితరులు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుని పుష్పాలతో వస్తున్న బానుముస్తాక్

అమ్మవారిని దర్శించుకున్న బానుముస్తాక్

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బుకర్‌ప్రైజ్ విజేత బానుముస్తాక్ బుధవారం హాసనాంబదేవిని దర్శించుకున్నారు. హాసన్‌లో నివసిస్తున్న బానుముస్తాక్ తన రచనల ద్వారా బుకర్‌ప్రైజ్ పొందిన విషయం తెలిసిందే. ఆమె ఇటీవల మైసూరులో జరిగిన దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అప్పట్లో ముస్లిం మతానికి చెందినవారిచే దసరా ఉత్సవాలు ఎలా ప్రారంభిస్తారని విమర్శలు సాగాయి. తాజాగా హాసనాంబదేవిని దర్శించుకున్న బానుముస్తాక్ హారతి తీసుకోవడంతోపాటు పూలు, ప్రసాదం స్వీకరించారు.

ఎస్ఎస్ఎల్‌సీలో 33 మార్కులకే పాస్

- పీయూసీలో 30కే..
- ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు
- మంత్రి మధు బంగారప్ప

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యావ్యవస్థలో మహత్తరమైన మార్పును ప్రభుత్వం తీసుకువచ్చింది. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో పాస్ మార్కులను తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి బుధవారం ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప బెంగళూరులో మాట్లాడారు. కొన్నేళ్లకాలంగా ఎస్ఎస్ఎల్‌సీలో 35 మార్కులతో ఉత్తీర్ణత సాధ్యమయ్యేది. ప్రస్తుతం 33 మార్కులకు తగ్గించారు. ఇక పీయూసీలో పాస్ అయ్యేందుకు కేవలం 30 మార్కులకే కుదించారు. ఎస్ఎస్ఎల్‌సీలో ప్రతి సబ్జెక్టులో వందకు 35 మార్కులు తప్పనిసరిగా ఉండేదన్నారు. కానీ 33 మార్కులకు తగ్గించామన్నారు. ఇంటర్నల్, ప్రధాన పరీక్షలతో కలిపి 33 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్టు అవుతుందన్నారు. పీయూసీలో 35 మార్కులకు ఉత్తీర్ణత విధానం ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రతి సబ్జెక్టులోనూ 30 మార్కులకు తగ్గించారు. ఈ కొత్త నిబంధన ఏడాది నుంచే అన్వయించనుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈ నిబంధన వర్తిస్తుందన్నారు. మారిన పరీక్షా విధానాన్ని సంస్కరించేందుకు మార్కులను తగ్గించినట్టు తెలిపారు. గతంలో పరీక్షలను పారదర్శకం చేసేందుకు వెబ్‌క్యాస్టింగ్ వ్యవస్థను అమలు చేశామని, తద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫలితాలకోసం అదనంగా కష్టపడేవారన్నారు. స్పెషల్ క్లాసులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పాటుపడేవారన్నారు. ఎస్ఎస్ఎల్‌సీలో ఇంటర్నల్ మార్కులు 20 ఉంటాయని, రాత పరీక్షలో 13 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత సాధించినట్టు అవుతుందన్నారు. ఇక సీబీఎస్ఈ మోడల్‌ను అనుసరిస్తున్నామని, పాఠ్యాంశాలలోనూ కొనసాగించదలిచామన్నారు. ఇంటర్నల్ మార్క్స్ 20 సాధించుకుంటే మరో 13 మార్కులు రాత పరీక్షల ద్వారా పొందితే ఉత్తీర్ణత వీలవుతుందన్నారు. మీడియా సమావేశంలో ప్రాథమిక విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు బంగారప్ప

కేజీఎఫ్ చాప్టర్-3కి సిద్ధం

- ఇన్‌స్టాలో ప్రశాంత్ నీల్ పోస్ట్



ప్రశాంత్ నీల్ పోస్టు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాకింగ్ స్టార్ యశ్‌ను పాన్ ఇండియా నటుడిగా మార్చిన దర్శకుడు ప్రశాంత్ నీల్, కేజీఎఫ్ చాప్టర్-3కి సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన ఓ పోస్టర్‌ను బుధవారం ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. కేజీఎఫ్-2 సినిమా 2022, ఏప్రిల్ 14న విడుదలైంది. ఈ సినిమా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రికార్డులు సృష్టించింది. చాప్టర్ -3 ఉంటుందని అదే సినిమాలో సంకేతం ఇచ్చారు. దీనికి సంబంధించి ఫైనల్ డ్రాఫ్ట్ సిద్ధమైనట్లు ప్రశాంత్ నీల్ పోస్టును బట్టి అర్థమౌతోంది. కేజీఎఫ్-3కి సంబంధించి మరికొన్ని నెలల్లోనే అప్‌డేట్స్ ఇస్తామని హొంబాళె ఫిలిమ్స్ ముఖ్యులు విజయ్ కిరగందూరు ఏడాదిక్రితం ప్రకటించారు. ఆ తరువాత ఎలాంటి ప్రకటనా రాలేదు. దర్శకుడు ప్రశాంత్ నీల్, నిర్మాత విజయ్ కిరగందూరు, నటుడు యశ్.. వేర్వేరు సినిమాలతో బిజీగా ఉన్నారు.

డిసెంబరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

- మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్, అధికారులు

బళ్లారి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బళ్లారి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిసెంబరు నుంచి సేవలు అందిస్తుందని వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి మంత్రి డాక్టర్ శరణ్ ప్రకాష్ ఆర్.పాటిల్ తెలిపారు. బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మంత్రి సందర్శించారు. అక్కడ వివిధ విభాగాల వైద్య నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. బిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధర గౌడ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రస్తుత పరిస్థితి, అవసరమైన వైద్య పోస్టులు, ఇతర సౌకర్యాలపై గంగాధర గౌడ మంత్రికి వివరించారు. 2008లో 450 పడకల ఆస్పత్రి మంజూరు అయిందన్నారు. 2018లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు టెండర్ పిలిచామన్నారు. ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉందని, ఇక్కడ అవసరమైన వైద్య నిపుణులు, వివిధ రకాల టెక్నీషియన్లను నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆస్పత్రిలో న్యూరాలజీ, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన గ్రూప్-బి, సీ పోస్టులను భర్తీ చేయడానికి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి తెలిపారు.

26 ఎకరాల్లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో గుర్తించిన 26 ఎకరాల్లో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉందని, ఇందుకు కమిటీ ఆమోదించినట్లు మంత్రి తెలిపారు. మంత్రితో పాటు వైద్యవిద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ మహ్మద్ మొహసైన్, బీఎండీడీ సూజాత రాథోడ్, కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్, న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వనాథ్, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

జీటీటీసీ కేంద్రం పరిశీలన: బళ్లారిలో ప్రభుత్వ టూల్ రూం, ట్రైనింగ్ సెంటర్ (జీటీటీసీ)ని బుధవారం మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ పరిశీలించారు. టూల్ రూం మెకానిస్ట్, డిసిగ్నేర్ మెకానిక్, ఇండస్ట్రియల్ ఆటోమిషన్ పీఎల్‌సీ, హెచ్ఎంఐ, ఎస్‌సీఏడీఏ, ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రభుత్వ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదోతరగతి పాస్ అయిన విద్యార్థులకు ఏడాది పాటు ఇక్కడ శిక్షణ ఇస్తారన్నారు.

అద్దె అడగొద్దు..

బీఎస్ఎన్ఎల్ భవనంలో జేసీ క్యాంపు కార్యాలయం

- నెలకు రూ.70 వేలు అద్దె
- పైసా కూడా చెల్లించని దుస్థితి
- రూ.30 లక్షలు బకాయి




పుట్టపర్తిలో జేసీ క్యాంపు ఆఫీస్‌కు కేటాయించిన బీఎస్ఎన్ఎల్ భవనం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కు ఉమ్మడి జిల్లా యంత్రాంగం పడ్డ బాకీలు ఇప్పట్లో చెల్లించేలా కనిపించడం లేదు. బీఎస్ఎన్ఎల్ లైవ్ టెలీకాస్ట్‌ల బిల్లులు రూ.40 లక్షల వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. నేటికీ వాటి ఊసేలేదు. అనంత జిల్లా విభజన సమయంలో కేటాయించిన భవనాల విషయంలోనూ అద్దెల రూపంలో మరో రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. 2022లో శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు సమయంలో పుట్టపర్తిలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కేటాయించారు. అదే సమయంలో పుట్టపర్తిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ భవనాన్ని ఆ జిల్లా జేసీ క్యాంపు కార్యాలయం, నివాసం కోసం వినియోగించుకునేందుకు అప్పటి కలెక్టర్, జేసీ.. ఆ సంస్థ అధికారులను సంప్రదించారు. ఆ భవనం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు అడగడంతో అప్పట్లో అనుమతులిచ్చినట్లు సమాచారం. బిల్డింగ్ రెనోవేషన్ బాధ్యతలు జిల్లా యంత్రాంగమే భరించుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు రెనోవేషన్ తరువాత సంబంధిత ఇంజనీర్లతో ఎస్టిమేషన్ వేయించి నెలకు రూ.70 వేలు చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ ఆ అద్దె సొమ్ము రూపాయి కూడా బీఎస్ఎన్ఎల్‌కు చెల్లించలేదని అధికారుల ద్వారా అందిన సమాచారం. పలుమార్లు అద్దె అడిగినా కలెక్టర్, జేసీ, ఆర్డీఓస్థాయి అధికారులు.. పైస్థాయి నిధులు రాలేదని చెప్పుకొస్తుండటంతో నిస్సహాయస్థితిలో బీఎస్ఎన్ఎల్ అధికారులు ఉండిపోయారు. ఈ క్రమంలోనే సంస్థ రాష్ట్ర, కేంద్రస్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు బీఎస్ఎన్ఎల్ వర్గాల సమాచారం.

ఇంతవరకూ అద్దె చెల్లించలేదు..



పుట్టపర్తిలో జేసీ క్యాంపు కార్యాలయం, రెసిడెన్సీ భవనం అద్దె చెల్లింపు విషయంలో జిల్లా యంత్రాంగం నుంచి స్పందన లేదు. పలుమార్లు అద్దె బకాయిలు చెల్లించాలని అప్పటి కలెక్టర్, జేసీలను కోరాం. వారి నుంచి స్పందన లేకపోగా.. ఫండింగ్ వస్తే ఇస్తామని చెప్పుకొచ్చారు. రూ.30 లక్షల వరకూ అద్దె చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం.

\- ముజీబ్‌పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

పునరుత్పత్తిపై దృష్టి సారించాలి

- పశు సంవర్థక శాఖ జేడీ ప్రేమ్‌చంద్



మాట్లాడుతున్న జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ ఆదేశించారు బుధవారం స్థానిక డీడీ కార్యాలయంలో డీడీలు రమేష్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్‌తో కలిసి ఏడీలు, వెటర్నరీ డాక్టర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వెటర్నరీ డాక్టర్ తమ పరిధిలోని ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి, గొడ్డుమోతు పశువులకు చికిత్స అందించడం ద్వారా ఉత్పత్తిని పెంచాలని అన్నారు. పశువుల ఆసుపత్రుల్లో సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. తాను ఆకస్మికంగా తనిఖీలకు వస్తానని, ఎక్కడ పొరపాట్లకు ఆస్కారం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని అన్నారు. పశుపోషకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యాధి నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాడి పశువులు, మూగ జీవాలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.

జడ్పీలో సందడి..!

ఉద్యోగోన్నతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఏసీఆర్ సమర్పణకు సీనియర్ అసిస్టెంట్ల క్యూ



ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం సందడి వాతావరణం కనిపించింది. పలు మండలాల నుంచి సీనియర్ అసిస్టెంట్లు బుధవారం క్యూ కట్టారు. కూటమి ప్రభుత్వం సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం డెడ్‌లైన్ పెట్టి సిబ్బందికి సంబంధించిన ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్) కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలోని అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు సమాచారం ఇచ్చి ఏసీఆర్ సేకరించడంలో జడ్పీ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. జడ్పీ కార్యాలయంలోని పరిపాలన విభాగంలో ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లతో సందడి వాతావరణం కనిపించింది. సంబంధిత గుమస్తాలు, అనంతరం డిప్యూటీ సీఈఓ తనిఖీ చేయించుకొని కమిషనర్ కార్యాలయానికి పంపడానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు 63 మంది మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారిని నియమించడంలో భాగంగా అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి, అనంతరం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలు ఖాళీ లేవు. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించి ఇప్పటికే అనంతపురం 4, సత్యసాయిలో 11 మందికి సంబంధించి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు కమిషనర్ కార్యాలయం నుంచి ఇప్పటికే వచ్చాయి. ప్లేస్‌మెంట్స్ కోసం ఫైల్ కలెక్టర్‌కు పంపారు. అనుమతి వచ్చిన వెంటనే స్థానాలు కేటాయిస్తే.. ప్రతి మండలానికి డిప్యూటీ ఎంపీడీఓలను భర్తీ చేసినట్లు అవుతుంది. మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారుల నియామకంలో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

గల్లంతైన వ్యక్తి మృతి

కనగానపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో రెండురోజుల క్రితం గల్లంతైన వ్యక్తి తల్లిమడుగుల గ్రామ సమీపంలో బుధవారం శవమై తేలాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం పంపనూరు సమీపాన హంద్రీనీవా కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం తల్లిమడుగుల కాలువలో శవం తేలాడుతున్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బయటికి తీసి విచారించగా నాగభూషణంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజారెడ్డి ఎక్కడ?

పట్టుకుని.. వదిలేసిన పోలీసులు..?

యల్లనూరు/పుట్లూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన రాజారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నాడా..? పరారీలో ఉన్నాడా అనే చర్చ జరుగుతోంది. యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రాజారెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనంతపురం, నంద్యాల జిల్లాలు, తెలంగాణలో పలువురి నుంచి రూ.2.50 లక్షలు చొప్పున వసూలు చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సుమారు రూ.60 కోట్ల వరకూ ఆయన లావాదేవీలు జరిగినట్లు సమాచారం. బాధితులో ఒకరైన హరికృష్ణ ఫిర్యాదు మేరకు రాజారెడ్డిని ఇటీవల అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిందితుడిని ఇంతవరకూ అరెస్టు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓ వైసీపీ నాయకుడి మధ్యవర్తిత్వంతో అతన్ని వదిలేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బాధితుల నుంచి, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. పులివెందుల, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారని సమాచారం.

జడ్పీ ఆవరణలో ఉత్కంఠ

ఏసీబీ తనిఖీలతో ఉద్యోగుల్లో ఆందోళన

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఆవరణలోని జిల్లా ఆడిట్ విభాగంలో ఏసీబీ అధికారుల తనిఖీలతో బుధవారం సాయంత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తనిఖీలతో జడ్పీలోని సిబ్బంది, అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఆడిట్ విభాగంలో సీనియర్ ఆడిట్ అధికారి లక్ష్మీనారాయణ రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టు పడ్డారన్న సమాచారం బయటకు పొక్కగానే కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఫోన్లు స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంటుగా పని చేసే శ్రీనివాసులు ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లో ఉండగానే ఆయన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడినట్లు సమాచారం. ఈక్రమంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సెలవుల బిల్లులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడానికి ఆడిట్ అధికారులు ముడుపులు అడగడంతో శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం సాయంత్రం ఆడిట్ అధికారి అడిగిన విధంగానే రూ.8 వేలు లంచం ఇస్తుండగా కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు మోహన్‌కుమార్, హామీద్‌ఖాన్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో జిల్లా పరిషత్ ఆవరణంలోని సిబ్బంది, అధికారులు ఉలిక్కిపడ్డారు. మనకు వచ్చిన తలనొప్పి ఎందుకని కార్యాలయ సమయం పూర్తి కావడంతో ఎవరి దారిన వారు మెల్లిగా వెళ్లిపోయారు.

ఐక్య పోరాటాలే ఐద్వా బలం



ఐద్వా రాష్ట్ర నూతన కమిటీ

- పీడిత ప్రజల పక్షాన పోరు సాగించాలి
- ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్
- ముగిసిన ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేయడమే ఐద్వా బలమవ్వాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ అన్నారు. నగరంలో ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు బుధవారం ముగిశాయి. మహిళా సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. ముగింపు కార్యక్రమంలో శ్రీమతి టీచర్ ప్రసంగించారు. దేశంలోని మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాల్లో వివక్ష కొనసాగుతోందని, మహిళలపై హింస పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ విధానాలకు మతతత్వ పార్టీలు తోడవడంతో మహిళల హక్కులు హరించే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఐద్వా సమావేశాలలో చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో 57 మందికి చోటు కల్పించారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యదర్శిగా సావిత్రి, కోశాధికారిగా శ్రీనివాస కుమారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమాదేవి, ప్రభావతి ఎన్నికయ్యారు. సీహెచ్ రమణి, వై.సత్యవతి, షేక్ మస్తాన్‌బీ, పూర్ణ, సరోజ, రమాదేవి, సాయిలక్ష్మి, శ్యామల, చంద్రిక కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు: పి.రమణమ్మ, బి.లక్ష్మి, ఎస్.హైమావతి, ఎస్.కుమార్, ఆర్ఎస్ మాధవి, కొండమ్మ, డి.డి. వరలక్ష్మి, భూలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, దైవకృప, ఐ.పద్మావతి, శ్రీదేవి, ఉదయకుమార్, కేతా పద్మజ, శ్యామల, సరోజ, కుమారి, అరుణ, పద్మ, రజని, అనూష, రమాదేవి, షమ్మీ, శివకుమారి, షేక్ మున్వర్, ఈశ్వరి, ముంతాజ్, అలివేలు, అరుణ, పద్మ, శ్యామల, అశ్విని, జ్యోతి, శ్రావణి, అమలశ్రీ, శ్రీదేవిని రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. రాజమండ్రి, అన్నమయ్య, కృష్ణా జిల్లాల మహాసభలు నిర్వహించిన తర్వాత, ఆ జిల్లాల సభ్యులను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటారు.

సావిత్రి భావోద్వేగం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సావిత్రి భావోద్వేగానికి గురయ్యారు. ఐద్వా ద్వారా దశాబ్దాలుగా మహిళల సమస్యలపై చేసిన విస్తృత పోరాటాలను గుర్తించి రాష్ట్ర, జాతీయ ప్రతినిధులు తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారని అన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ఇప్పటిదాకా చేసిన పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు.

పది తీర్మానాలు

మూడురోజులపాటు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో పది అంశాలపై తీర్మానాలు చేశారు.

- మైక్రో ఫైనాన్స్ సంస్థల దోపిడీ నుంచి కుటుంబాలను కాపాడాలి. ఆ సంస్థలు ప్రభుత్వ నియంత్రణ ఉండాలి, వడ్డీ రేట్లు తగ్గించాలి.
- డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. బ్యాంకు ప్రాసెసింగ్ చార్జీలను గ్రూపు మహిళలకు మినహాయించాలి. డ్వాక్రా సంఘాల్లో అవినీతిని అరికట్టే చర్యలు చేపట్టాలి.
- మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను అరికట్టాలి. అందుకు పటిష్టమైన చట్టం చేయాలి.
- ఎన్నికలలో సూపర్ సిక్స్ అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి.
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి. వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలి.
- మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి. మద్యం, మత్తు మందులను నియంత్రించాలి.
- నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి. 14 రకాల సరుకులు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.
- హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి.
- అనంతపురం ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించాలి.



ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి సావిత్రి

సీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి

కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని, లేదంటే కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్రాసు రాష్ట్రంలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ కోలార్‌తో కలిపి 12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ప్రాంతంగా 1951లో తీర్మానం చేశారని ఆయన గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి 12 జిల్లాలతో కలిపి రాయలసీమను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటులో తీర్మానం చేయాలని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించాలని అన్నారు. ఆ దిశగా రాయలసీమ పాలకులు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కొత్త రాష్ట్ర ఏర్పాటు, ప్రస్తుత రాష్ట్రాలు, ప్రాంతాలలో మార్పులు, చేర్పులు, సరిహద్దులలో మార్పులు, పేర్లలో మార్పులు చేసేందుకు ఎవరికి అధికారం ఉందో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వివరిస్తుందని అన్నారు. కోస్తాంధ్ర, తెలంగాణ కంటే రాయలసీమ ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, రాష్ట్ర విభజన కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయాక కొద్దిపాటి మార్పులు, చేర్పులతో పాత ఆంధ్ర రాష్ట్రమే ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిందని అన్నారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా చేసుకోవాలని రాయలసీమవాసులు ఎంతగానో శ్రమించారని అన్నారు. సీమవాసుల కళ్లలో నీరు ఇంకా ఎండలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ అభివృద్ధిని కాంక్షించి, ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని కోరారు. కర్నూలుకు గురువారం వస్తున్న ప్రధానికి సీమ ప్రజా ప్రతినిధులు వినతిపత్రాలను సమర్పించాలని ఆయన సూచించారు.

గాలిలో ప్రాణాలు..!

టాపుపై ప్రయాణం నిషిద్ధమనీ, అపాయమనీ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడ చూసినా రాసి ఉంటారు. వాటి అమలు మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. బడిపిల్లలు, అదికూడా ఆడుకునే మనస్తత్వం ఉన్నవారు బస్సు టాపుపైకి ఎక్కుతుంటే వద్దని చెప్పేవారు కరువయ్యారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం.. సురక్షితం అని రాసుకునే అధికారులు.. పిల్లల ప్రాణాలను గాలిలో ఉంచుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం, కల్లుహోళ్ల గ్రామాల విద్యార్థులు గోవిందవాడ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. ఉదయం పాఠశాలకు, సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్సు కిక్కిరిసిపోతోంది. దీంతో విద్యార్థులు టాపుపైనే కూర్చుని వస్తున్నారు. బస్సు టాపుపై ఆడుకుంటూ, కేకలు వేసుకుంటూ, అటు ఇటు తిరుగుతున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా ప్రాణాలకే ప్రమాదం. ఆర్టీసీ సిబ్బంది ఇవేవీ పట్టించుకోకుండా టాపు ఎక్కించేస్తున్నారు. అధికారులు మేల్కొని తక్షణమే అదనపు బస్సులు ఏర్పాటు చేసి, టాపు ప్రయాణాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

\- బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి



బస్సు టాపుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలి

కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని వివిధ పర్యాటక సంరక్షణ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం, కసాపురం, గుత్తి కోట, పెన్నహోబిలం, పెనకచెర్ల, వజ్రకరూరు, గూగూడు, హంపాపురం తదితర పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవాసంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలన్నారు. చెరువులు, నీటి వనరుల వద్ద బోటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజలకు వినోదం, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అనంతపురంలో విశాల స్థలంలో ఉన్న శిల్పారామాన్ని అభివృద్ధి చేసి, స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ప్రత్యేక వేదికగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, డ్వామా పీడీ సలీంబాషా, శిల్పారామం మేనేజర్ శివారెడ్డి, చరిత్ర ప్రొఫెసర్ సుధాకర్, ఆలిండియా రేడియో ప్రతినిధులు, ఇంటాక్ అధ్యక్షుడు రామ్‌కుమార్, గుత్తి కోట పరిరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్‌చౌదరి, పురావస్తు శాఖ మ్యూజియం అధికారులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ @ 5.3 టీఎంసీలు



డ్యాం గేట్ల వద్దకు చేరిన నీరు

కూడేరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటింది. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 5.3 టీఎంసీలకు చేరింది. టర్బైన్‌లో సమస్య తలెత్తడంతో ఆరు రోజులుగా జల విద్యుదుత్పత్తిని ఆపేశారు. దీంతో హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు రాకుండా నేరుగా ఎంపీఆర్‌కు మళ్లించారు. టర్బైన్ మరమ్మత్తుల అనంతరం రెండ్రోజుల్లో ఉత్పత్తి పునఃప్రారంభించనున్నట్లు జెన్‌కో ఈఈ వెంకటరామకృష్ణయ్య తెలిపారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మాత్రమే 380 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వచ్చి చేరుతోంది. జల విద్యుదుత్పత్తి తిరిగి ప్రారంభిస్తే హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు వదలనున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు కాగా, 5 నుంచి 6 టీఎంసీలలోపే నిల్వ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 443 అడుగులు కాగా, ప్రస్తుతం 435 అడుగులు ఉన్నట్లు వారు తెలిపారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటడంతో జలకళను సంతరించుకుంది. పర్యాటకుల సందడి పెరిగింది.

విద్యుత్ శాఖ ఉద్యోగుల సమ్మె వాయిదా

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఉద్యోగుల సమ్మె వాయిదా పడింది. మంగళవారం రాత్రి ప్రభుత్వంతో రాష్ట్ర విద్యుత్తు జేఏసీ నాయకులు చర్చలు జరిగినట్లు జిల్లా నేతలు అంటున్నారు. డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరనట్లు తెలుస్తోంది. ప్రధాన మంత్రి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నాయకులు సమ్మెను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 17న తిరిగి రాష్ట్ర జేఏసీ నాయకులు.. ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు జిల్లా నేతలు తెలిపారు. ఆ మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు.

రెండో విడతలో 52 మందికి ప్రవేశాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్లలో మొత్తం 52 మంది ప్రవేశాలు పొందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మూడురోజులపాటు సాగిన ఈ ప్రక్రియ బుధవారం ముగిసింది.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

హైటెక్ సిటీతో హైదరాబాద్..

గూగుల్‌తో విశాఖ అభివృద్ధి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

గూగుల్ సంస్థ విశాఖకు రాకపై హర్షం

అనంతపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీతో నాడు హైదరాబాద్... గూగుల్‌తో నేడు విశాఖ అభివృద్ధి చెందుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతకు ఇదొక నిదర్శనమన్నారు. బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చి హైటెక్ సిటీగా రూపకల్పన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం వైజాగ్‌కు గూగుల్ సంస్థను తీసుకొచ్చి మరోసారి తన ముందుచూపు, దార్శనికతను చాటుకున్నారన్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థ గూగుల్ విశాఖలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. గిగావాట్ సామర్థ్యంతో గూగుల్ సంస్థ విశాఖలో ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రానున్న ఐదేళ్లలో 1.33 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టనుందన్నారు. తద్వారా అమెరికా తరువాత ప్రపంచంలోనే ఆ సంస్థ నిర్మించే అతిపెద్ద ఏఐ హబ్‌గా విశాఖపట్నం యూనిట్ నిలుస్తుందన్నారు. 2 లక్షల మందికి ఉపాధి కల్పించే 1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. ప్రతి కుటుంబానికి కృత్రిమ మేధ ఫలాలను చేరువ చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుందన్నారు. భావితరాల కోసం వీరు చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్స్...

చంద్రశేఖర భారతి 3(జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో హిందూ ధర్మాన్ని ప్రచారం చేసిన ఆధ్యాత్మిక వేత్తల్లో ఒకరైన శ్రీ చంద్రశేఖర భారతి 1892 అక్టోబరు 16న శృంగేరిలో జన్మించారు. పూర్వనామం నరసింహ శాస్త్రి. శృంగేరిలోని శారదా పీఠానికి జగద్గురుగా 1912 నుంచి 1954 వరకు కొనసాగారు. జీవన్ముక్తగా పేరొందారు. గురువు నివాసాన్ని అభినవ శంకరాలయ పేరుతో ఆలయంగా తీర్చిదిద్దారు. 1954 సెప్టెంబరు 26న సమాధి అయ్యారు.

ఆస్కార్ వైల్డ్ (జయంతి)



ఐర్లండు దేశానికి చెందిన ఆస్కార్ వైల్డ్ 1854 అక్టోబరు 16న జన్మించారు. నాటక రచయిత, నవలా రచయిత, కవి, కథానికుడు. ఆయన రచనల్లోని చతురత పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. లండన్‌ను విక్టోరియా రాణి పాలించే కాలంలో ప్రముఖ రచయితల్లో ఒకరిగానే కాకుండా ఆయన సమకాలికులలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 46వ యేట 1900 నవంబరు 30న కన్నుమూశారు.

హేమామాలిని (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో అభిమానులచే డ్రీమ్ గర్ల్‌గా పిలవబడిన ప్రముఖ నటి హేమామాలిని తమిళనాడు రాష్ట్రం అమ్మన్‌కుడిలో 1948 అక్టోబరు 16న జన్మించారు. ప్రముఖ భారతీయ నటి, దర్శకురాలు, నిర్మాత, నాట్య కళాకారిణి, రాజకీయ నాయకురాలు. నాట్య కళాకారిణిగాను, నటిగాను గుర్తింపు పొందారు. సుమారు 150 సినిమాల్లో నటించారు. హేమామాలిని, ధర్మేంద్ర హిట్ జంటగా పేరొంది తరువాతి కాలంలో వివాహం చేసుకున్నారు. ఫిలింఫేర్, జీవితసాఫల్య పురస్కారం, పద్మశ్రీ తదితర అవార్డులు అందుకున్నారు. 2003-09 మధ్య బీజేపీ నుంచి రాజ్యసభ సభ్యురాలిగాను వ్యవహరించారు. 2014 నుంచి మధుర లోక్‌సభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

దండమూడి సుమతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దండమూడి సుమతి రామమోహనరావు 1950 అక్టోబరు 16న ఏలూరులో జన్మించారు. పురుషాధిక్యత ఉన్న భారతీయ సంగీత వాయిద్య రంగంలో మృదంగ వాద్యాన్ని వృత్తిగా స్వీకరించిన మొట్టమొదటి మహిళా కళాకారిణి. తండ్రి నిడుమోలు రాఘవయ్య వద్ద మృదంగం నేర్చుకుని పదో ఏటనే కచేరీ నిర్వహించిన ఘనత ఆమెది. ఆకాశవాణిలో ఏ గ్రేడ్ కళాకారిణి. మృదంగ శిరోమణి, మృదంగ మహారాణి, నాద భగీరథి, మృదంగ లయ విద్యాసాగర బిరుదులతో ఆమెను పలు సంస్థలు సన్మానించాయి. మృదంగ సంగీత అకాడమీ ఉత్తమశ్రేణి వాద్య కళాకారిణిగా ఎంపిక చేసింది. లయవేదిక సంస్థను స్థాపించి భర్త పేరిట మృదంగ కళాకారులను సత్కరిస్తున్నారు. 2009లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, 2021లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

నవోమి ఒసాకా (పుట్టినరోజు)



టెన్నిస్ క్రీడాకారిణి నవోమి 1997 అక్టోబరు 16న జపాన్ దేశం ఒసాకాలోని చా-కులో జన్మించారు. 1999లో ఫ్రెంచ్‌లో విలియమ్స్ సోదరీమణులు టెన్నిస్‌లో పోటీ పడడంతో స్ఫూర్తి చెందిన ఒసాకా తండ్రి తన ఇద్దరు కుమార్తెలకు టెన్నిస్ ఎలా ఆడాలో నేర్పించారు. జపనీస్ క్రీడా పరికరాల సంస్థ యోనెక్స్ 2008 నుంచి ఆమెకు రాకెట్లను సరఫరా చేసింది. సింగిల్స్‌లో ఆమెకు ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ ఫస్ట్ ఏసియన్ ప్లేయర్‌గా ప్రకటించింది. నాలుగు సార్లు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ అందుకున్నారు. ప్రపంచంలో అత్యంత ప్రభావశీలురు టాప్ 100 జాబితాలో 2019, 2020, 2021లో ఒకరిగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

రొళ్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడగార్లగుట్ట గ్రామం వద్ద 544 జాతీయరహదారిపై బుధవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మడకశిరమండలం గోవిందాపురం పంచాయతీ డీ. గొల్లహట్టి గ్రామానికి చెందిన సిద్దప్ప, దేవరాజు అగళికి వెళ్లి వస్తుండగా కొరగార్లగుట్ట వద్దకు రాగానే గొల్లహట్టి గ్రామానికిచెందిన వెంకటప్ప ద్విచక్రవాహనాన్ని కుడివైపునకు తిప్పాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న సిద్దప్ప, దేవరాజు వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దప్ప అక్కడికక్కడే మృతిచెందగా దేవరాజు, వెంకటప్పకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. సిద్దప్ప భార్య సుశీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్ఐ హిదాయత్ తెలిపారు.

నెగ్గిన అవిశ్వాసం

పావగడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నీకేపురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు అరుంధతిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. 12 మంది గ్రామ పంచాయతీ సభ్యులు చేతులెత్తి తమ అరుంధతికి వ్యతిరేకంగా బుధవారం సమావేశంలో ఓటేశారు. పంచాయతీ అభివృద్ధికి అరుంధతి ఏమాత్రం కృషి చేయడంలేదని, అవిశ్వాసాన్ని పెట్టారు. బుధవారం జరిగిన ఈ ప్రక్రియకు పంచాయతీ అధ్యక్షురాలు అరుంధతితోపాటు మరో ఇద్దరు సభ్యులు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడంతో త్వరలో నూతన అధ్యక్ష ఎన్నికకు తేదీని ప్రకటించనున్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు

నాలుగు రోజుల క్రితం సంతేబిదనూరులో జరిగిన గౌరీబిదనూరుకు చెందిన యువకుడి హత్యకేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంతేబిదనూరు పంచాయతీలో ఓ గ్రామానికి చెందిన ముగ్గురు హత్యకేసులో పాల్గొన్నట్లు తెలిసింది. వీరిని అదుపులోకి తీసుకుని విచారించి హత్యకుగురైన పవన్‌కుమార్ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

తాగునీటి కోసం డ్యాం నిర్మాణానికి చర్యలు

» ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుడుమలె గ్రామంలోని చారిత్రాత్మక పేరొందిన ఆనెకెరెకు డ్యాం నిర్మించి అక్కడనుంచి ముళబాగిలు పట్టణానికి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. తాలూకాలోని సంగసంద్ర గ్రామంలో మరవ పారుతున్న చెరువుకు వాయనం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాలూకాలోని దొడ్డనగుర్కి గ్రామంలోని పురాణ ప్రసిద్ధ వెంకట రమణస్వామి దేవస్థానంలో ఇటీవల పవిత్రోత్సవంలో పాల్గొన్నవేళ సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించామన్నారు. ప్రస్తుతం దేవుడిదయవలన తాలూకాలో 25కుపైగా చెరువులు నిండి మరవ పారుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. చెరువులు నిండిన ప్రభావంతో సమీపంలోని బోర్లలో సైతం నీటిమట్టం పెరిగి రైతులకు అనుకూలం కానుందన్నారు. కాగా చెరువులు, కుంటలు సమృద్ధిగా ఉండడం ద్వారా పిల్లలను ఆటలాడేందుకు పంపేవేళ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాలూకాలో ఏ చెరువు మరవపారినా కులమతాలకు అతీతంగా అందరూ కలసి వాయనం సమర్పించాలని అభిప్రాయపడ్డారు. చెరువుల అభివృద్ధికి దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు గ్రామస్తులు



వాయనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ఎమ్మెల్యే ఆత్మీయస్వాగతం పలికారు. కళాకారులు కోలాటంతో ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ గీత, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి, సహకారి యూనియన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ప్రముఖులు నరసింహప్ప, శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

» ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవరాజ్



జాతీయ టెక్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దేవరాజ్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యత పట్ల శ్రద్ధ చూపాలని ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ కే దేవరాజ్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. హాకథాన్‌లు, టెక్‌ఫెస్ట్‌లు వారిలో ప్రతిభను పెంపొందించేందుకు కారణం కానుందన్నారు. బుధవారం రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్శిటీలో ప్రవృతి 2025 పేరిట జాతీయ టెక్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేశారు. రంగదొరై మెమోరియల్ ఆసుపత్రి గౌరవ అధ్యక్షులు బినోంద్ హంపాపుర ముఖ్యులుగా పాల్గొన్నారు. నగరంలోని వివిధ కళాశాలలతోపాటు వివిధ రాష్ట్రాలనుంచి విద్యార్థుల బృందాలు పాల్గొన్నాయి. మూడురోజులపాటు టెక్‌ఫెస్ట్ జరగనుందని రిజిస్ట్రార్ అశోక్ తెలిపారు. 25కుపైగా పోటీలు జరుగుతాయని, విజేతలకు 10 లక్షల రూపాయల మేర బహుమతులు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బినోంద్ హంపాపుర మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, వారే భారత భవిష్యత్తు అన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలన్నారు. జపాన్‌లో డాక్టర్ల కంటే రోబోట్లు ఎక్కువ పనిచేస్తున్నాయని, మనదేశంలో కూడా అటువంటి సాంకేతికత రావాలని పిలుపునిచ్చారు. పీణ్యా పారిశ్రామిక సంఘం అధ్యక్షులు శివకుమార్, కాసియా అధ్యక్షులు గణేశ్‌లతోపాటు యూనివర్సిటీ డీన్ డాక్టర్ శరత్‌కుమార్ మహారానా తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో రవాణాలో సుస్థిరత

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న దశాబ్దకాలంలో రవాణాలో సుస్థిరత సాధ్యం కానుందని మిసిలియో మొబిలిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. నగరంలో గ్లోబల్ క్వీన్ మొబిలిటీ పేరిట జరిగిన చర్చాగోష్టిలో ఏథెర్ కో-ఫౌండర్ తరుణ్ మెహతాతో పాటు ఇన్ఫోసిస్ యాక్సిలర్ వెంచర్స్ ముఖ్యులు క్రిస్‌గోపాలకృష్ణ, గ్రైండింగ్ అకాడమీ ఫర్ విర్ట్ షాఫ్ట్ టెక్నిక్ ముఖ్యులు జాన్ హంయన్నా, మారుతి సుజుకి ఇండియా ప్రతినిధి రామన్ సీవీ, షెల్ కంపెనీ ప్రతినిధి కస్తూరి గోమతం, బజాజ్ ఆటో ముఖ్యులు ప్రియాంక బిసెన్ షాలు పాల్గొన్నారు. 2047 నాటికి దేశం మరింత అభివృద్ధి సాధించనుందని, ఆర్థికతతోపాటు పర్యావరణం పైనా ప్రాధాన్యత పెరుగుతుందన వక్తలు అభిప్రాయపడ్డారు. సాంకేతికత వేగవంతంగా అభివృద్ధి చెందిందని గతంలో కేవలం 60 ఎలక్ట్రికల్ కార్లను మాత్రమే సుజుకు తయారు చేసేదని, 7వేల కార్లు ప్రపంచానికి ఎగుమతి చేస్తోంద న్నారు. 40ఏళ్ల ప్రయాణంలో సుజుకి గణ నీయ మైన ప్రగతి సాధించిందన్నారు. ఈవీ వాహనాలకు ప్రాధాన్యత పెరగడం మరో మైలురాయి అన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్ షేపింగ్ మొబిలిటీ విషయమై జాన్ హంయన్నా మాట్లాడుతూ సుస్థిరమైన మౌలిక సదుపాయాలు, సమగ్ర విన్యాసం వంటి అంశాలకు నేటి యువతరం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బెంగళూరుకు వచ్చిన ప్రతిసారి ఓ ప్రత్యేకత అనిపిస్తుందని, ఇక్కడి ఆధునికత మరెక్కడా ఉండదనిపిస్తోందన్నారు. దేశంలో బహిరంగం అవుతున్న అంశాలు ప్రపం చానికి ఓ దిశా నిర్దేశం ఇచ్చేలా ఉన్నాయన్నారు. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతోపాటు పలు సంస్థలు భాగస్వామ్యులయ్యాయి.

వరి పరిశోధనపై ఫిలిప్పీన్స్‌తో ఒప్పందం



ఒప్పందంలో మంత్రి చలువరాయస్వామి తదితరులు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వరి పరిశోధనలపై ఫిలిప్పీన్స్ అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రంతో మండ్య వ్యవసాయ యూనివర్సిటీ ఒప్పందం కుదిరినట్లు వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి ప్రకటించారు. ఫిలిప్పీన్స్‌లోని మనీలానుంచి బుధవారం ఒక ప్రకటనన విడుదల చేశారు. రాష్ట్రంలో వరద, కరువు, తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు వంటి పరిణామాలపై సమగ్ర పరిశోధనలు చేసేదిశగా ఒప్పందం చేసుకున్నారు. తద్వారా రాష్ట్రంలోనూ వరి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రారంభించే విషయం కూడా చర్చించామన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రం డిప్యూటి జనరల్ డైరెక్టర్ జునల్ సయానో, డాక్టర్ సంకల్ప భోస్లే, మండ్య అగ్రికల్చర్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కేఎం హరిణి కుమార్, వేణు ప్రసాద్, మల్లికార్జున స్వామి, రాయచూరు అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ సుజయ్, వీసీ ఫారం వరివంగడం శాస్త్రవేత్త డాక్టర్ దీపక్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

25న రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, సంవిధాన ఓదు అభియాన సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న రాజ్యాంగానికి సంబంధించి డిగ్రీ విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. సంవిధాన ఓదు అభియాన సంచాలకులు రాజశేఖరమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ నాగేంద్రకుమార్‌లు ప్రకటించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో వ్యాసరచన పోటీలపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి మాట్లాడుతూ రాజ్యాంగానికి సంబంధించి 4 ప్రధాన అంశాలను ఎంపిక చేశామన్నారు. రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు, కర్తవ్యాలు, రాజ్యాంగం, సామాజిక న్యాయం, రాజ్యాంగం - మహిళ, రాజ్యాంగం - సమాఖ్య వ్యవస్థ అనే అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు ఉంటుందని, ప్రోత్సాహక బహుతులు 50మందికి వెయ్యి రూపాయల చొప్పున అందిస్తామన్నారు. ప్రవేశరుసుం ఉండదని, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి ధ్రువీకరణపత్రంతో హాజరు కావాలన్నారు. ఏదైనా డిగ్రీతోపాటు లా



కన్నడ అధ్యాపకుడు రుద్రేశ్ అదరంగి తదితరులు

విద్యార్థులు పాల్గొనవచ్చునని, 25ఏళ్లలోపు ఉన్నవారికి మాత్ర మే అవకాశం అన్నారు. పరీక్షలు కన్నడ, ఇంగ్లీష్‌లలో రాయవచ్చునని, కళాశాల గుర్తింపుకార్డు తప్పనిసరి అన్నారు. 90 నిమిషాలపాటు పరీక్షకు అవకాశం ఉంటుందన్నారు. నవంబరులో జరిగే రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

పురసభ సభ్యుడి వేధింపులతోనే ఉద్యోగి మృతి

» మృతదేహంతో కార్యాలయం ముందు నిరసన



పురసభ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

విజయపుర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పురసభ సెకండ్‌గ్రేడ్ ఉద్యోగి పవన్‌జోశి (38) మృతికి పురసభ సభ్యుడు ఏఆర్ అనిపుల్ల వేధింపులే కారణమనే ఆరోపణలు వినిపించాయి. ఏఆర్ హనీఫ్‌ఉల్లా అక్రమాలను బయట పెట్టేందుకు ప్రయత్నించిన పవన్‌జోశిని బెదరించారని అతడి భార్య అనన్య ఆరోపించారు. పవన్‌మృతికి కారణమైనవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సర్వే విధులలో ఉండగా పవన్‌జోశి కుప్పకూలాడు. స్పృహ కోల్పోయి పవన్‌ను బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్టు వైద్యులు సోమవారం నిర్ధారించారు. మంగళవారం కుటుంబీకుల కోరికమేరకు అవయవ దానం చేశారు. బుధవారం అంతిమసంస్కారాలకోసం పట్టణానికి తీసుకొచ్చారు. పురసభ ఆవరణలో మృతదేహంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అనన్య మాట్లాడుతూ తన భర్త పవన్ మొబైల్‌లో ప్రతి ఒక్కటి రికార్డింగ్ అవుతాయని స్వాధీనం చేసుకుని దర్యాప్తు అన్ని వాస్తవాలు బయటపడతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు హనీఫ్‌ఉల్లా ఫోటోబ్యానరుకు చెప్పుతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హనీఫ్‌ఉల్లా పురసభ సభ్యత్వం సస్పెండ్ చేయాలని సభ్యులు షఫీవుల్లా, మునిరాజు, శ్రీనివాస్, మహేశ్‌లు డిమాండ్ చేశారు. హనీఫ్‌ఉల్లాపై భూ అక్రమాలు సహా పలు ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం వేధింపులకు గురిచేసి ఒకరి మృతికి కారణమైన అతడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భూముల అక్రమ ఖాతాలకు సంబంధించి ఉన్నతాధికారులు పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మన్రో తోపు ఆక్రమణదారులకు నోటీసులు



నోటీసులు అందజేస్తున్న అధికారులు

చిలమత్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపులో ప్రభుత్వ భూములని ఆక్రమించుకొని భవనాలను నిర్మించుకున్న పలువురికి పంచాయతీ, రెవెన్యూ అధికారులు కలిసి బుధవారం నోటీసులు అందజేశారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు ఉన్నవి కోల్పోవడంతో వారు కూడా కోదండ రామాలయ ప్రాంగణంలో కబ్జాలకు పాల్పడుతుండటంతో అధికారులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించిన వెంటనే ఆక్రమణలు అడ్డుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మన్రో తోపు ఆక్రమణలపై తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే పీఏ వీరయ్య స్వయంగా మన్రో తోపుకి వచ్చి పరిశీలించి నివేదికను ఎమ్మెల్యేకి అందజేసినట్లు సమాచారం. అధికారులతో చర్చించిన తరువాత ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించి ఆక్రమణదారులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందిన 7 రోజుల్లోగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఈ సందర్భంగా వారికి తెలియజేశారు.

స్విట్జర్లాండ్ పర్యటనలో మంత్రి బోసరాజు



క్వాంటం కంప్యూటింగ్ ఏఐ కేంద్రంలో మంత్రి బోసరాజు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏఐ కేంద్రాన్ని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్ఎస్ బోసరాజు సందర్శించారు. ప్రపంచమంతటా క్వాంటమ్ కంప్యూటింగ్‌పై చర్చలు సాగుతున్న తరుణంలో మంత్రి బుధవారం సందర్శించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ అరిందమ్ ఘోష్, సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సదాశివప్రభులు మంత్రివెంట ఉన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ



సెంటర్ ప్రారంభోత్సవంలో సుబ్రహ్మణ్యం తదితరులు

బెంగళూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలకు చెందినవారు బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీస్, ఇన్సూరెన్స్ విభాగాలలో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యత అపెక్సాన్ ఇండియా ప్రైవేట్ సంస్థ సమకూర్చనుందని ప్రకటించారు. ఆహాన్ ఒకేషనల్ సెంటర్‌ను బుధవారం కేఆర్‌పురంలో ప్రారంభించారు. ది మా ఫాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణలు ఇస్తున్నట్టు అపెక్సాన్ సంస్థ ముఖ్యులు సుబ్రమణ్యం పుత్రేవు ప్రకటించారు. నగరంలో డిగ్రీతో సమానమైన చదువు పూర్తి చేసినవారికి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగాలకు అవసరమైన శిక్షణలు ఇవ్వదలిచామన్నారు. ది మా ఫాయ్ ఫౌండేషన్ ట్రస్టీ హేమలతారాజన్ మాట్లాడుతూ సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే మా ఆశయమన్నారు. సెంటర్ ద్వారా నగర యువతకు అనుకూలం కానుందని అభిప్రాయపడ్డారు.

90ఏళ్ల వృద్ధుడికి రోబోటెక్ సర్జరీ

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 90ఏళ్ల వృద్ధుడికి పిత్తకోశంలో ఇన్‌ఫెక్షన్‌కు రోబోటెక్ సర్జరీరూపంలో వైద్యం అందించినట్టు సర్జన్ జావేద్ హుసేన్ తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో ఇటీవల 90ఏళ్ల వృద్ధుడు చికిత్సకు వచ్చాడన్నారు. కిడ్నీలో రాళ్ల ద్వారా పిత్తకోశంలో రంధ్రం ఏర్పడి గ్యాంగ్రిన్ వంటి ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించామన్నారు. వయసు ఎక్కువగా ఉన్నందున అబ్జర్వేషన్‌లో ఉంచి సర్జరీ చేశామన్నారు. ప్రస్తుతం అతను సంపూర్ణంగా కోలుకున్నారని డాక్టర్ తెలిపారు.

న్యాయవాదిపై చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల సభ్యులు

దొమ్మసంద్ర, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. దొమ్మసంద్రలోని అంబేడ్కర్ భవన్ ముందు బుధవారం వివిధ సంఘాల సభ్యులు నిరసన తెలిపారు. దొమ్మసంద్ర మునిరాజు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో అనకరళ్ళి కృష్ణప్ప, జగదీశ్, దొమ్మసంద్ర గ్రామపంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలతో వ్యభిచారం

» మంగళూరులో నలుగురి అరెస్టు

బెంగళూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాలికలతో వ్యభిచారం నిర్వహిస్తున్న అడ్డాపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. ఆటో డ్రైవర్ మహేశ్, కటీల్ నివాసి శ్రీకాంత్, యజ్ఞేశ్, దిలీప్‌లు పట్టుబడినవారు. దక్షిణకన్నడ జిల్లా మూడబిదరి తాలూకి నిడ్డోడి నివాసి ఆటో డ్రైవర్ మహేశ్ ఇరువురు బాలికలను నమ్మించి తీసుకొచ్చాడు. ఇదే సమయంలోనే ఇద్దరు స్నేహితులను ఇంటికి రప్పించుకున్నారు. సమగ్ర సమాచారంతో మూడబిదరి పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇద్దరు బాలికలను రక్షించి నలుగురిని అరెస్టు చేశారు.

రైతు సేవాకేంద్రాల్లో యూరియా

గుడిబండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర, కరేకెర, సిసిగిరి, రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు రైతు సేవాకేంద్రం వద్దకు వెళ్లి పేర్లను నమోదు చేసుకుని తీసుకెళ్లాలని సూచించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	13,150	45,287
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,843	45,891
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.58

టెలీస్కోప్ శిక్షణ శిబిరంలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి గవిసిద్ధప్పను అభినందిస్తున్న శ్రీనంద పాఠశాల అధ్యక్షుడు వి.గాంధీ, ఉపాధ్యాయులు

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర శాస్త్రీయ పరిశోధనా మండలి దొడ్డబళ్లాపుర్‌లోని అనిబిసెంట్ పార్క్‌లో నిర్వహించిన మొదటి రాష్ట్ర స్థాయి టెలిస్కోప్ శిక్షణ శిబిరంలో శ్రీనంద పాఠశాల విద్యార్థి గవిసిద్ధప్ప ఉత్తమ ప్రతిభ కనబరిచారు.శిబిరానికి జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. ఇందులో శ్రీనంద పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి గవిసిద్ధప్ప వరల్డ్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. పాఠశాల అధ్యక్షుడు వి.గాంధీ విద్యార్థిని సన్మానించారు. జీవితంతో పాటు క్రమశిక్షణ అతిముఖ్యమన్నారు. వి.రమణ కుమార్, మురళీకృష్ణ, సరితా, లక్ష్మీకాంత, వినయ్‌చౌదరి, రాజేశ్వరీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు విద్యార్థిని అభినందించారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచండి: డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవలి రోజుల్లో అన్ని వయసుల వారికి గుండెపోటు వస్తున్న నేపథ్యంలో వైద్య అధికారులు కార్డియో పల్మనరీ రిససికేషన్(సీపీఆర్)పై అవగాహన కల్పించాలని డీహెచ్‌ఓ డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. బుధవారం ఆయన జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో 13 నుంచి 17వరకు సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాల నేపథ్యంలో అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తులకు వృత్తిపరమైన వైద్య సహాయం కోరుకునే వారికి ధైర్యం, కరుణ, బాధ్యతతో సహాయం చేసేందుకు సీపీఆర్‌పై అవగాహన పెంచాలన్నారు. జిల్లా వెక్టర్ అధారిత వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ పూర్ణిమ కత్తిమణి, కుష్ఠువ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లా ఆరోగ్య విద్య ఇన్‌చార్జి అధికారి ఖుర్షీద్ బేగం, బసరాజ్, డాక్టర్ సురేశ్, ప్రతాప్, సలహాదారులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యుడు

బళ్లారిరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు స్కూళ్లు, కాలేజీల ఆవరణలో విద్యార్థులకు భారత్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డీఐఈటీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు, సొసైటీ జిల్లా కార్యదర్శి ఎంఏ షాకీబ్ ఆధ్వర్యంలో ప్రజలలో గుండెపోటు నివారణపై అవగాహన కల్పించారు. గుండెనొప్పితో బాధపడుతున్న వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చే ముందు అతనికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వుంటే సీపీఆర్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాసంస్థ ప్రిన్సిపాల్ తిప్పేస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరోగ్యానికి చేతిశుభ్రత చాలా అవసరం'

హిందూపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి చేతిశుభ్రత చాలా అవసరమని మున్సిపల్‌చైర్మన్ రమేష్ అన్నారు. బుధవారం జాతీయ హ్యాండ్‌వాష్‌డే పురస్కరించుకుని ఇందిరానగర్‌లో స్వయం సహాయక సంఘాలు, ఆర్పీలు, ఓబీలతో కలిసి చేతి శుభ్రత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హ్యాండ్ వాష్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు గంగులయ్య, గంగరత్నమ్మ, పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

● మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్



జాబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రిశరణ్ ప్రకాశ్ పాటిల్, ఉమారెడ్డి

బళ్లారి సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి కొత్తగా ప్రారంభించిన 'ఇంక్యుబేషన్ జాబ్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీ యుగంలో డిగ్రీలు మాత్రమే చాలదని, నైపుణ్యాలు, జ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో రాణించాల్సి అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఏఐసీటీఈతో కలిసి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చే పాఠ్యాంశాలను బోధిస్తుందన్నారు. ఇది ఆవిష్కరణల యుగమని, కొత్త ఆవిష్కరణల కోసం కొత్త సాంకేతికతలు, ప్రతిరంగంలో ప్రతి ఒక్కరూ నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఉద్యోగ మేళాలో నమోదు చేసుకున్న వారికి ఏఐ మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీ వినియోగంపై నైపుణ్యాలు కమ్యూనికేషన్ అందిస్తున్నట్లు తెలిపారు. పీకేసీసీఐ అధ్యక్షుడు ఉమారెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆధునిక డిజిటల్ టెక్నాలజీతో అనుసంధానమైందన్నారు. ఎఫ్‌సీసీఐ, బీడీసీసీఐతో స్టార్టప్ మార్గదర్శకత్వం, శిక్షణ, పెట్టుబడి సంబంధాలు అందిస్తుందన్నారు. బీడీసీసీఐ లక్ష్యాలను దాని నిస్వార్థ ప్రజా సేవలను వివరిస్తూ ఇంక్యుబేషన్ యువత కొత్త వ్యవస్థాపకులకు ఆశాకిరణంగా పనిచేస్తుందని అన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ ముంబైకి చెందిన వికాసిత మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ లార్వాన్ హోల్డింగ్‌తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, మేయర్‌నందీశ్, పరిశ్రమల మండలి మాజీ అధ్యక్షుడు మహారుద్రగౌడ, శ్రీనివాసరావు, మంజునాథ్, కోశాధికారి పాలన్న పాల్గొన్నారు. వివిధ కళాశాలలు, సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక ఇన్‌చార్జి మంత్రిగా శరణ ప్రకాష్ పాటిల్

బళ్లారిరూరల్: పట్టణంలోని హోటల్ నక్షత్రలో నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక, జీవనోపాధి రాయచూరు ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్‌ను నియమించారు. బుధవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నగర అధ్యక్షుడు బోయపాటి విష్ణువర్ధన్, బ్రూస్‌పేట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హుస్సేన్ పీరా బళ్లారి జిల్లా అసంఘటిత కార్మిక విభాగ అధ్యక్షుడు అలివేలు సురేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రిని సన్మానిస్తున్న బోయపాటి విష్ణువర్ధన్ తదితరులు

గ్రామాల్లో అభివృద్ధికి ముందుకు రావాలి: ఎమ్మెల్యే

కంప్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనులకు పార్టీలు విడనాడి ముందుకొచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. బుధవారం కంప్లి తాలుకా చిక్కజాగనూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అభివృద్ధి పనుల ద్వారా నెరవేరుస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు, పాఠశాల అదనపు గదులు, పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేశామన్నారు. ప్రస్తుతానికి గ్రామంలో ఆటోస్టాండ్ నుంచి బలాపురం వంతెన వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే రూ.2 కోట్లతో చిక్కజాగనూరు, బలాపురం మధ్య వుండే బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఫ్యాక్టరీ రోడ్డు మిగిలి ఉన్న పనులు చేపడతామన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట పథకాల ద్వారా నిలబెట్టుకుందన్నారు. విద్యార్థులకు, మహిళలకు, రైతులకు, ప్రజలకు అందరికీ అనుగుణంగానే అన్ని పథకాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, అమరేగౌడ, పంపన్నగౌడ, హనుమప్ప, ఆనంద్ గౌడ, వీరేష్, జడెప్ప, చిరంజీవి, నాగరాజు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చిక్కజాగనూరులో భూమిపూజ చేపడుతున్న ఎమ్మెల్యే గణేష్

కాంగ్రెస్ పథకాలను కాపీ కొడుతున్న మోదీ

● కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి సంతోష్‌లాడ్, అధికారులు

రాయచూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ కాపీకొడుతున్నారని కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ విమర్శించారు. నగరంలో బుధవారం గంజ్ కల్యాణమండపంలో కార్మిక శాఖ, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా బోర్డు, రవాణా శాఖ సంయుక్తంగా నిర్వహించిన స్మార్ట్ కార్డ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మంత్రి మాట్లాడారు. హామీ పథకాల వల్ల ప్రజలు ఆర్థికంగా సాధికారత సాధిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు సంవత్సరానికి రూ.65 వేలు, అంటే ఐదు సంవత్సరాలలో రూ.3 లక్షలు అందుతున్నాయని అన్నారు. దేశంలో మరే ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో డబ్బును ప్రజలకు అందించలేదన్నారు. పథకాల వల్ల ప్రభుత్వం దివాళా తీస్తోందని ప్రధాని మోదీ చెబుతున్నప్పటికీ, బిహార్ ఎన్నికల్లో గెలవాలంటే ఆయన కూడా అదే రకమైన వాగ్దానాలు గుప్పిస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. 'మోదీజీ, జూట్ మత్ బోలో ఖుదాకే పాస్ జానా హై... వహా నా హాథీ హై నా ఘోడా హై వహా పైదల్ హీ జానా హై' అంటూ మంత్రి లాడ్ చేసిన వ్యాఖ్య సమావేశం హాల్‌లో నవ్వులు పూయించింది. 4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మోదీ వాదనను ప్రశ్నిస్తూ మాట్లాడిన లాడ్, మన దేశ తలసరి ఆదాయం కేవలం రూ.2 లక్షలు, జపాన్ రూ.30 లక్షల ఆర్థిక వ్యవస్థ కలిగి ఉందన్నారు. చైనా 19 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ ఉందన్నారు. మనది ట్రిలియన్ డాలర్ల విజయం అని గర్వంగా చెప్పుకోవడం అర్థరహితం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశాదీప పథకం, గిగ్ వర్కర్ల బీమా పథకం, సినిమా వర్కర్ల నిధి చట్టం వంటి అనేక కొత్త పథకాలు దేశం మొత్తం దృష్టిని ఆకర్షించాయని మంత్రి అన్నారు. 101 అసంఘటిత రంగ కార్మికుల్లో దాదాపు 30-40 లక్షల మందికి ఉచితంగా స్మార్ట్ కార్డులు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 25,45,607 మంది కార్మికులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారన్నారు. రాయచూరు జిల్లాలో 58,240 మంది కార్మికులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో 5 లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని, వారికి సామాజిక భద్రతా పథకాన్ని అందించడానికి ముసాయిదా సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. దేశంలో ఇలా చేస్తున్న మొదటి రాష్ట్రం ఇదే కావడం మాకు గర్వకారణమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గంటకు ఆరుగురు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నందున, ప్రతి జిల్లాలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అభ్యర్థనకు స్పందించిన మంత్రి సంతోష్ లాడ్, రాయచూరులో ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రధాన శాఖను స్థాపించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తానని హామి ఇచ్చారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



ఉప్పార హోసళ్లిలో రోడ్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని ఉప్పర హోసళ్లి గ్రామంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.67 లక్షల పీడబ్ల్యూడీ నిధుల కింద ఈ పనులు జరుగనున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చేయడమే ధ్యేయమని అన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం సిద్దరామయ్య సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. పీడబ్ల్యూడీ ఇంజనీర్ అనిల్, కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

బంగారు గొలుసు చోరీ.. దుండగుడికి దేహశుద్ధి



గాయపడిన దొంగను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హోసూరు(క్రైం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని శూలగిరి ఇమ్మడినాయకనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ మేనక యథాప్రకారం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని సామలపల్లం వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నారు. బుధవారం ఉదయం వెనుక నుంచి వచ్చిన ఓ యువకుడు ఆమె గొంతులోని 5 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. టీచర్ మేనక కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు దొంగను వెంబడించి పట్టుకున్నారు. బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అతన్ని చితక బాదారు. స్థానికులు చితకబాదినప్పుడు అతనికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న శూలగిరి పోలీసులు స్థలానికి చేరుకున్నారు. అతడి వెంటనే అంబులెన్స్‌లో కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తులో బెంగళూరుకు చెందిన కుమరేశ్ (38)గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వార్డుల్లో మేయర్ పర్యటన

హోసూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లోని 17వ వార్డు పరిధిలోని రామయ్య నగర్, ఎంఎంనగర్ ప్రాంతాల్లో మేయర్ సత్య పర్యటించారు. మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. మురుగునీటి, సమస్యలు వార్డు సమస్యలన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు పిర్యాదులను ఆయన అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మేయర్ వెంట రీజనల్ చైర్మెన్ రవి, కౌన్సిలర్ నాగరాజ్, మున్సిపల్ యూత్ టీం డిప్యూటీ ఆర్గనైజర్లు కార్తీక్ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న మేయర్ సత్య

ఈవీఎం కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

హోసూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని ఈవీఎంలను నిల్వ చేసే కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాష్ట్ర సమన్వయ అధికారి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వి.శ్రీధర్‌లు ఈవీఎంల గిడ్డంగిలో నెలవారీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణగిరి రెవెన్యూ డివిజనల్ కమీషనర్ ఎస్. షాజహాన్, ప్రత్యేక తహశీల్దార్ కె.సంపత్తు, కృష్ణగిరి తహశీల్దార్ పి.డి.రమేశ్ పాల్గొన్నారు.



ముఖాముఖి మాట్లాడుతున్న మంత్రి నిర్మలా సీతారామన్

యువత ఉద్యోగాలను సృష్టించాలి

● ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

బళ్లారి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలో యువత ఉద్యోగ సృష్టికర్తగా ఎదగాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కర్ణాటక పర్యటనలో భాగంగా బుధవారం హొస్పేట్‌లోని ఒక ప్రైవేటు హోటల్‌లో పీఎం ఐఎస్ ఇంటర్నెసిన్‌లతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం పరిశ్రమలు, యువతకు ఉద్యోగ భద్రత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై చర్చించారు. దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి హాజరైన పారిశ్రామిక రంగాల వారు అలాగే ఇంటర్నెసిన్‌లతో ఆమే ఇష్టాగోష్టిగా మాట్లాడారు. భాషలు ఏవైనా భావం ఒక్కటేనన్నారు. ప్రాంతాలు ఏవైనా దేశం ఒక్కటేనని, అందుకే మీరు మీకు వచ్చిన భాషలో ధారాలంగా మీ అభిప్రాయం వ్యక్తం చేయాలన్నారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, రాజస్తాన్, హరియాణా, ఆంధ్రప్రదేశ్ ఇలా అనేక రాష్ట్రాల నుంచి ఇంటర్నెసిన్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేస్తాం

● కమ్మ సంఘం అధ్యక్షుడు రాము



కుడితినిలో నూతనంగా ఎన్నికైన కమ్మసంఘం పదాధికారులు

కంప్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో కమ్మ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు వి.రాము తెలిపారు. బుధవారం పట్టణంలో పల్లెద భవన్‌లో కమ్మసంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కమ్మ సంఘం పదాధికారులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి మూడుసార్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘంలోని ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గౌరవాధ్యక్షుడిగా సుర వెంకటరమణప్ప, ఉపాధ్యక్షుడిగా హీరేంద్ర ప్రసాద్, ఎం ఆదెప్ప, ఆర్.కౌశిక్, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీగా కోనంకి సురేష్, కోశాధికారిగా ఎల్.నాగరాజు, సభ్యులుగా కందారి ప్రతాప్, ఎం.వెంకటేష్, యు.తిమ్మప్ప, జి.శ్రీధర్, శేషబ్బు, ధనుంజయ అందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు సంఘం యువజన అధ్యక్షుడిగా ఆర్ హరీష్, ఉపాధ్యక్షులుగా ఎం.మంజునాథ్, ఎస్.మనోజ్ కుమార్, కన్వీనర్ సుధాకర్, కిరణ్ ఎన్నుకున్నారు.

చారిత్రక పోరాటానికి కేంద్రం దిగి రావాల్సిందే

● ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్



దీక్షలో పాల్గొన్న పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు

రాయచూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేయడం దారుణమన్నారు. నగరంలోని మహాత్మ గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె శిబిరం బుధవారానికి 1252వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం నాయకులందరూ ముఖ్యంగా ఇక్కడి ప్రజాప్రతినిధులు తమవంతు పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు.

మిరపకాయల సంస్కరణ కేంద్రం పరిశీలన



మిరపకాయల సంస్కరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

సిరుగుప్ప, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ మిరపకాయల సంస్కరణ సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. సిరుగుప్ప తాలుకాలోని కొంచిగేరి గ్రామంలో గురువారం కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా మిరపకాయల సంస్కరణ సేకరణ కేంద్రం ప్రారంభమవుతుంది. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. పంచాయతీ అధికారులు, కార్యదర్శులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై వాహనాల పార్కింగ్

హోసూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని పలు ప్రాంతాలలోని ఫుట్‌పాత్ ప్రాంతాలు, ఇతర రోడ్లపై ఇష్టం వచ్చినట్టు వాహనాలు పార్కింగ్ చేయడం సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఏఎస్పీ అక్షయ్ అనిల్‌వక్రె మాట్లాడుతూ ట్రాఫిక్ విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



నో పార్కింగ్ స్థలంలో వాహనాల పార్కింగ్